# సరసమైన సాయంత్రం

**పెళ్లయి** హైదరాబాదుకి కాపురానికి వచ్చేముందు నుండే సావిత్రి టాంక్‌బండ్, ఇందిరాపార్క్ భాగోతాల గురించి చదివింది; వింది. సాయంత్రాలలో అక్కడ జంటలు చేరి చేసే పనుల గురించి ఆమె స్నేహితురాళ్లు చెప్తూంటే 'నిజంగానా! అంత సిగ్గులేకుండానా!?' అని ఆశ్చర్యపడుతూనే అన్నీ తరచి తరచి అడిగి తెలుసుకొనేది. తన కలల రాకుమారుడితో కలిసి తనూ ఆయా స్థలాలలో విహరించినట్లు ఊహించుకొనేది.

సినిమాలలో అయితే పార్కుల్లో, బీచిల్లో అబ్బాయి, అమ్మాయి ఎంత ప్రేమ ఒలకబోసినా పోలీసులు పట్టుకోరు. వెనకాల ముప్పై, నలభై మంది డాన్సర్లుండగా వీళ్లేం చేసిపోతారన్న ధీమా కాబోలు. కానీ నిజజీవితంలో ఓ మగా, ఆడా కాస్త మూలగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నా దారిన వెళ్లే ప్రతీవాడూ పరికించే చూసేవాడే. అలాటప్పుడు పోలీసులు వచ్చి అల్లరి పెట్టకుండా ఉంటారా?

పెడతారనే వింది సావిత్రి. స్టేషన్‌కి లాక్కెళతామని బెదిరిస్తారట. సైకిలు రాంగుసైడులో వెళితేనే, 'చదువుకున్నోరు, ఆ మాత్రం తెలీదా' అని తిట్టేవాళ్లు ఇలాటి ఘట్టాల్లో వదిలిపెడతారా? హితబోధలు చేసి, పెద్దవాళ్లకు కబురంపించి, ...అమ్మో... తలచుకుంటేనే సావిత్రికి ముచ్చెమటలు పోసేవి.

తనూ ఎవరినో ప్రేమించాలనీ, ఎవరిచేతనో ప్రేమించబడాలనీ, అందరూ గొప్పగా చెప్పుకునే 'ప్రేమ' అనేది అనుభవించాలనీ సావిత్రి అనుకొనేది. కానీ ప్రేమకథలన్నీ విషాదాంతాలే కావడం చదివి, చూసి, భయపడి పోనీ పెళ్లయ్యాక భర్తనే తీరిగ్గా ప్రేమిస్తే క్షేమదాయకం కదా అని సర్ది చెప్పుకుంది. కానీ ఇలా టాంక్‌బండ్‌పై రసవద్ఘట్టాలు 'మిస్' కావడం మాత్రం జీవితంలో పెద్దలోటు కదా అని బాధపడుతూండేది.

హైదరాబాదులో పనిచేస్తున్న రాజాతో పెళ్లి నిశ్చయమయ్యాక ఆమె తన రొమాంటిక్ ఈవినింగ్ కలకు ఒక రూపాన్ని ఇవ్వగలిగింది. తాంబూలాలు పుచ్చుకొన్నక, పెళ్లి నిశ్చయమైంది కాబట్టి, అతనూ, తనూ టాంక్‌బండ్‌కి వెళ్లి బహిరంగంగా 'ఏకాంతాన్ని' అనుభవించవచ్చు. పోలీసులు పట్టుకున్నా ఫర్వాలేదు. ఎలాగో పెళ్లి కాబోయే వాళ్లేగా. పెద్దవాళ్లకి తెలిసినా నవ్వుతూ నాలుగు చివాట్లు వేస్తారు తప్ప కొంపేం మునగదు.

ఈ విషయంలో రాజా అభిప్రాయం కనుక్కొని హైద్రాబాదు వెళితే మంచిది. పట్టుచీరలు కొనాలని వంక పెట్టవచ్చు, బంధువుల ఇంట్లో దిగవచ్చు. ఓ సాయంత్రం ఇద్దరూ కలిసి వెళ్లవచ్చు. కానీ రాజాకు ఉత్తరంలో ఇవన్నీ రాయాలంటే జంకు పుట్టింది. ఇలాటి రొమాంటిక్ ఐడియాలు అతని ఒంటికి పడతాయో లేదో? కుర్రవాడు బుద్ధిమంతుడు అని పెళ్లిచేస్తారు

కానీ రసికుడా, కాదా అని తెలుసుకోరు. 'అమ్మో, ఈ అమ్మాయి ఫాస్ట్‌టైపులా ఉంది' అనుకొని అతను పెళ్లి కాన్సిల్ చేస్తే? ఇలా ఎంతమందితో తిరిగిందో అంటూ అభాండాలు వేస్తే? ఇక జన్మలో పెళ్లి కాదు. పగటి కలల వరకే మన రొమాన్స్ పరిమితం చేసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు' అనుకొని ఊరుకుంది సావిత్రి.

పెళ్లయ్యేక మొగుణ్ని కదలేసి చూసింది - 'అలా సరదాగా ఇందిరా పార్కుకో, టాంక్‌బండ్‌కో వెళదామా' అని. 'ఎందుకూ, పోరంబోకులు తిరిగే చోట్లవి. మన ప్రైవసీకి ఇంట్లో లోటేముంది? మా అమ్మా, నాన్నా ఎవరూ లేరు మనతో. మనిద్దరమూ అక్కడి కెళ్లి వెలగబెట్టాల్సిన శృంగారం ఏముంది? ఇక్కడేమైనా అడ్డా, ఆపా?' అని తీసిపారేసాడు.

ఇంట్లో ఎంత సన్నిహితంగా మసలినా పదిమంది ఎదుటా, పార్కు బెంచీ మీద అలా మొగుడి ఒళ్లో పడుక్కోడం, స్కూటరు మీద వెళుతూ అతని తొడమీద చేయి వేయడం - అదో సరదా తనకి. అవన్నీ అతనికి విప్పిచెప్పడం ఎలా? చెప్పకూడదు కూడా. మింగుడుపడకపోతే 'నీకేమైనా వెర్రా?' అంటాడు. అందుకని 'సరదాగా వెళ్లి చల్లగాలి పీల్చివద్దాం, ఇంట్లో మగ్గిపోవడం ఎందుకు?' అంది.

'చల్లగాలా? మురికి గాలా? అంతగా మగ్గిపోతూంటే ఎయిర్ కూలర్ కొందాంలే' అన్నాడు రాజా.

ఇలాటివాడిని సాధించినా, వేధించినా ఏం ప్రయోజనం? అందుకే పెళ్లయి ఆర్నెల్లయినా సావిత్రి కోరిక తీరలేదు. తీరని కోరిక ఇంకా బలపడి కొమ్మలు, రెమ్మలు వేసింది. ముందులో మొగుడూ, తనూ చెట్టాపట్టాలు వేసుకొని కూచుంటే చాలనుకొన్నది, ఇంకా కాస్త ముందుకెళితే బాగుంటుందనిపించింది. బస్సులో వెళుతూండగా ఆమె కంటబడ్డ టాంక్‌బండ్ జంటలు చాలా... చాలా... ముందుకు వెళుతున్నారు.

పోలీసు వచ్చి పట్టుకుంటాడన్న ఆలోచన రాకపోలేదు సావిత్రికి. దానికి ఏం చెయ్యాలో ముందే ప్రణాళిక వేసి పెట్టుకుంది. 'అసలు పోలీసు వచ్చి పట్టుకుంటేనే థ్రిల్. లేకపోతే ఏముంది? ఇంట్లో ఉన్నట్టే ఉంటుంది. పెళ్లికాని పిల్లలా ఉండాలి తను. (మట్టెలు ఇంట్లో పెట్టేయచ్చు. మంగళసూత్రం లోపలికి ఎక్కడికో తోసేయచ్చు.) తనూ, రాజా మంచి రొమాంటిక్ మూమెంటులో ఉండగా పోలీసు వస్తాడు, స్టేషన్‌కి రమ్మని అదిలిస్తాడు, స్టేషన్ కెళ్లాకనే తను చెప్తుంది - 'మేమిద్దరమూ మొగుడూ పెళ్లాలమేరా నాయనా' అని. మంగళసూత్రం చూపిస్తుంది. కావాలంటే ఇంటికొచ్చి పెళ్లి ఫోటోలు చూడమంటుంది. దెబ్బకి దంగైపోతాడు పోలీసు. సారీ చెప్పి ఆటో ఎక్కించి ఇంటికి పంపుతాడు. సరదాకి సరదా తీరుతుంది, సేఫ్టీకి సేఫ్టీ ఉంటుంది.' ఇలా సాగాయి ఆమె ఆలోచనలు. ఇవన్నీ రాజాకు చెప్పడం అనవసరం అనుకుంది సావిత్రి. 'ఎందుకొచ్చిన వేషాలివి?' అని విదిలించేయచ్చుతను.

ఓ శనివారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి గుడికి అని బయల్దేరతీసింది. అక్కడ రద్దీ ఎక్కువగా ఉండడంతో దర్శమయ్యేసరికి బాగా చీకటి పడింది. టాంక్‌బండ్ మీద నుంచి వెళదామని మారాం చేసింది. ఏ కళ నున్నాడో రాజా సరేనన్నాడు. నడుస్తూ కాళ్లు లాగాయి కూచుందామంది. రాజా కాదనలేకపోయాడు. ఇద్దరూ ఒక ఖాళీ బెంచీ మీద కూచున్నారు. చీకటిగా, ఓ పక్కగా ఉన్నందుకు సంతోషించింది సావిత్రి. భర్త మెడచుట్టూ చేతులేసి కబుర్లు చెప్పసాగింది. భర్తను మూడ్‌లోకి తీసుకురావడం ఎలాగో ఈ ఆర్నెలల్లోనూ ఆమె

బాగా నేర్చుకుంది.

కానీ రాజా మూడ్‌లోకి రాలేకపోతున్నాడు, రెండేళ్ల క్రితం ట్యాంక్‌బండ్ మీద జరిగిన సంఘటన అతని మనస్సులో మెదలుతూండడం వలన. సావిత్రి అనుకొనేటంత 'అరసికుడు' కాదతను. అప్పట్లో ఆఫీసు కెళ్లే దారిలో రోజూ ఓ డాబామీద కనబడే అమ్మాయికి రాజా బస్‌లోంచి చెయ్యి ఊపుతూండేవాడు ఓ రెణ్నెల్ల తర్వాత ఆ అమ్మాయి బస్టాపులో కనబడితే పలకరించాడు. వారం తిరక్కుండా ట్యాంక్‌బండ్‌కి రావడానికి ఆమెను ఒప్పించగలిగాడు.

ఆ రోజు, ఇలాటి టైములో ఆ అమ్మాయిని ముద్దు పెట్టుకుంటూంటే భుజం మీద చెయ్యి పడింది. పోలీసు కానిస్టేబుల్. హిప్ పాకెట్లో ముందే పెట్టుకున్న పది రూపాయల నోటు తీసి అందించాడు. మారు మాట్లాడకుండా వెళ్లిపోతున్న పోలీసు ఆ అమ్మాయిని చూసి ఆగిపోయాడు. అమ్మాయి మొహం తిప్పేసుకొంది. పోలీసు డబ్బు వెనక్కు ఇచ్చేసి "పోకిరీ వేషాలేస్తున్నవ్‌లే! స్టేషన్కి రా!" అన్నాడు.

రాజా అప్పట్లో మంచి ధైర్యంగా ఉండేవాడు. "భలేవారే, నా వైఫ్ సార్. ఏదో సరదాగా షికారుకొచ్చాం" అని దబాయించాడు.

"గట్లనా? మీ ఫాదరిన్లా ఏం జేస్తడు తమ్మీ?" అన్నాడు పోలీసు వెక్కిరిస్తూ.

"ఆరెండ్ బీలో ఈఈ"

"కాదు, పోలీసు కానిస్టేబుల్, యాదుంచుకో"

రాజాకు అర్థం కాలేదు. ఇంతలోనే పోలీసు ఆ అమ్మాయి రెక్క పుచ్చుకొని లేపాడు. "సదువుకోవే అని టూషన్‌కి పంపితే గిదా నువ్ జేసేది? ఇంటికొచ్చాక జెప్తా నీ పని." అంటూ ఓ ఆటోను పిలిచి "నా బిడ్డను మా ఇంటితాన దింపు" అని పురమాయించాడు. ఆ అమ్మాయి రాజా వంక చూడనైనా చూడకుండా ఆటో ఎక్కింది. మరుసటిరోజు నుండి డాబా మీద కనబడితే ఒట్టు. ఒకవేళ కనబడినా కూడా ఒక వారం దాకా రాజా చేయి ఊపలేకపోయేవాడు. ఆవేళ పోలీసుస్టేషన్లో చెయ్యి మెలిపెట్టడంతో విరిగినంత పనయింది. పోలీసు చేతి దెబ్బలు రెండు తినేసరికి బుగ్గలు వాచి రెండురోజులు సెలవు పెట్టవలసి వచ్చింది.

భార్య మాటలకు ఊ కొడుతున్నా, ఆమె శృంగార చేష్టలకు అసంకల్పితంగా ప్రతిస్పందిస్తున్నా రాజా కళ్లముందు అనేక దృశ్యాలు తిరుగుతున్నాయి -


- 'మళ్లీ అదే పోలీసు, సావిత్రిని భార్యేనని తను చెప్పినా అతను నమ్మకపోవడం, స్టేషన్‌కి లాక్కెళ్లడం, చెయ్యి... కలుక్... ఈ సారి ఫ్రాక్చర్'

- 'పోలీసు నమ్మి వెళ్లిపోవడం, కాని సావిత్రికి తన ఫ్లాష్‌బాక్ తెలిసిపోవడం, కోపం తెచ్చుకోవడం, విడాకులకై అర్జీ...'

- 'పోలీసు కూతురు, తన ప్రస్తుత ప్రియుణ్ని వెంటబెట్టుకురావడం, సావిత్రిని చూసి జాలిగా, చిరునవ్వు నవ్వడం, 'వీడొట్టి దద్దమ్మ' అని తన గురించి చెప్పడం'...

తలలోంచి ఆ దృశ్యాలు చెరిపేయడానికి రాజా తల గట్టిగా విదిలించాడు. ముద్దు పెట్టుకోబోయిన సావిత్రి చికాకు పడింది. అతని తల కదలకుండా రెండు చేతులా పట్టుకొని పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టుకుంది.

రొమాంటిక్‌గా ఉండడంలో తనెవరికీ తీసిపోనని సావిత్రి సంతోషిస్తూండగానే "మీరిక్కడికి



వచ్చి ఎంతసేపయిందండీ" అనే ప్రశ్న వినబడింది.

రాజా, సావిత్రి దూరంగా జరిగి పక్కనే నిలబడ్డ వ్యక్తి కేసి చూసారు. ఆజానుబాహువు. మిలటరీ వాడిలా మీసాలు. బొంగురు గొంతుక. మఫ్టీలో ఉన్న పోలీసేమో! "మా ఫామిలీ అండి. ...ఊరికే... సరదాగా..." అన్నాడు రాజా వణుకుతున్న గొంతుకతో.

భర్త భయం చూసి సావిత్రి నవ్వుకుంది. వచ్చినవాడు భర్త మాటలు పట్టించుకోకుండా చటుక్కున కిందకు వంగి దేనికోసమో వెతుకుతున్నాడు. 'తామెంత దూరం పోయి ఉంటామోనని పరీక్షిస్తున్నాడు కాబోలు' అన్న చిలిపి ఊహ పోయి నవ్వు వచ్చింది సావిత్రికి. నవ్వుకుంటూనే మంగళసూత్రం తడిమి చూసుకోబోయింది - అంతగా అవసరమైతే చూపించాలి కదాని. చేతికి తగల్లేదు. మెడలో లేదా? ఇందాకా బిర్లా గుడి కెళ్లి ఆ బజారు సందులోంచి తిరిగి వచ్చేటప్పుడు మెడమీద ఏదో పాకినట్టనిపించింది. ఎవడైనా కొట్టేసాడేమో!

'ఇప్పుడెలాగ? తామిద్దరూ భార్యాభర్తలమని సాక్ష్యాలూ, సంపన్నాలూ చూపించేలోపునే రాజాని లాకప్పులో వేసి చావగొట్టేస్తే? తనను రేప్ చేసేస్తే?' నుదుటిమీద చెమట తుడుచుకుంది సావిత్రి.

వచ్చినతను లేచి నుంచొన్నాడు. అతనూ ఖంగారుగానే ఉన్నాడు. "...నేనూ, మా ఫ్రెండూ ఇక్కడ కూచున్నాం ఇందాకా... నా పర్సు... బ్లాక్ కలర్‌ది పోయింది. కిందపడిందేమో మీరు చూసారా?... మీరొచ్చేముందు వేరెవరైనా కూచున్నారా? ...మేం వెళ్లి ఓ హాఫెనవరయి ఉంటుంది..." అని మాట్లాడుతూనే వెతుకుతున్నాడు. రాజాను, సావిత్రినీ లేవమన్నట్టు సైగచేసాడు.

రాజాకు భయం పోయింది. 'ఓకే, ఓకే' అంటూ నిలబడ్డాడు. కానీ సమాధానం ఏం చెప్పాలో అతనికి తట్టడం లేదు. సావిత్రి నిలబడడంతో లోపల 'క్లింగ్'మని చప్పుడయింది. తడిమి చూసుకుంది. మంగళసూత్రం హుక్ ఊడి లోపల పడిపోయిందిలా ఉంది. 'హమ్మయ్య' అనుకొనేలోపునే 'వీడెవడైనా దొంగేమో, ఏదో కథ చెప్పి దగ్గరకొచ్చి కత్తి చూపిస్తాడేమో' నన్న ఊహ పోయి మళ్లీ భయం పట్టుకుంది. మంగళసూత్రం కూడా ఇంట్లో పడేసి వస్తే

బాగుండేదనిపించింది.

వచ్చినతను బెంచీ కిందా, పైనా వెతికి 'బ్లడీ బి...' అనుకుంటూ లేచాడు. ఏమీ దొరకనట్టుంది. వెళ్లి మోటారుసైకిలు స్టార్టు చేయబోతూ వెనక్కి వచ్చాడు. నాలుగడుగుల దూరంలో నుంచొని రాజా నుద్దేశించి -

"బ్రదర్, బీ కేర్ ఫుల్... ఫ్రెండు అని చెప్పా కదా, ఫ్రెండు కాదు, ఇక్కడే తగిలింది. ఇలాగే ఓ  డీప్ కిస్సిచ్చి పర్సు కొట్టేసింది. డబ్బు సంగతి వదిలెయ్. ఐడెంటిటీ కార్డు పోయింది. నువ్వైనా జాగ్రత్తగా ఉండు." అని హెచ్చరించి గబగబా వెళ్లి కసిగా మోటారు సైకిలు కిక్కిచ్చాడు.

ఆ తర్వాత టాంక్‌బండ్‌కు వెళ్దామని చాలా నెలలదాకా సావిత్రి అనలేదు.

(ఆంధ్రజ్యోతి వీక్లీ డిసెంబరు 97)

